సాక్షి
మెదక్

శనివారం । 12 । ఏప్రిల్ । 2025



డబ్బుల కోసమే మహిళ హత్య

డబ్బుల కోసం మహిళను హత్య చేసిన నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

వివరాలు 12లో ▸



అరటి.. లాభాల్లో మేటి

ఏ సీజన్‌లో అయినా అరటికి డిమాండ్ ఉంటుంది. దీంతో సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.

వివరాలు 12లో ▸



యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

అల్లాదుర్గం మండల పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

వివరాలు 13లో ▸

న్యూస్‌రీల్

తాగునీటి ఎద్దడి రాకుండా చూడండి

ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాబోయే వేసవి సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. మిషన్ భగీరథ పథకం అమలు చేస్తూనే పట్టణంలోని అన్ని బోర్లకు మోటార్లు బిగించి, నీటి సరఫరా పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో చెత్త సేకరణ సరిగా చేపట్టకపోవడంపై విచారం వ్యక్తం చేశారు. కాగా పట్టణంలో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫిర్యాదులు వస్తున్నాయని, సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రాయరావు చెరువు పంట కాల్వ నిర్మాణ పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

నిరంతర వైద్య సేవలు అందించాలి: డీఎంహెచ్‌ఓ

పాపన్నపేట(మెదక్): రోగులకు నిరంతర వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్ఓ శ్రీరాం వైద్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం పాపన్నపేట పీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని సూచించారు. జాతీయ కార్యక్రమాలు ఎయిడ్స్, ఫైలేరియా, కుష్టు, మలేరియా తదితర రోగాల నివారణకు వైద్య సిబ్బంది నిరంతర కృషి చేయాలని చెప్పారు. ఆయన వెంట డాక్టర్ హరిప్రసాద్, అన్వర్, సీహెచ్‌ఓ చందర్, శ్రీనివాస్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మెదక్ మున్సిపాలిటీ: పట్టణంలో శనివారం ఆయా ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతులు చేయనున్న నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మెదక్ విద్యుత్ శాఖ ఏడీఈ మోహన్‌బాబు, పట్టణ ఏఈ నవీన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో పట్టణ ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌గౌడ్

నర్సాపూర్ రూరల్: రాజకీయ పార్టీలకు కార్యకర్తలే పట్టుగొమ్మలని బీజేపీ రాష్ట్ర ఓబీసీ ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దచింతకుంటలో మండల పార్టీ అధ్యక్షుడు నీలి నగేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీజేపీ క్రియాశీల సభ్యత్వ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పథకాలను ప్రజలకు ఎప్పటికప్పుడు వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్టీ మోర్చా ప్రధాన కార్యదర్శి రాములు నాయక్, బీజేవైఎం మండల అధ్యక్షుడు రాజేష్, బూత్ అధ్యక్షులు సాయినాథ్, నాగరాజ్ పాల్గొన్నారు.

నైపుణ్యం ఉంటే ఏదైనా సాధించవచ్చు



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల కేంద్రం మేనేజర్ ప్రకాష్

నర్సాపూర్ రూరల్: పట్టుదలతో పాటు నైపుణ్యం ఉంటే ఏదైనా సాధించవచ్చని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్. ప్రకాష్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చదువు పూర్తి కాగానే ఉద్యోగం రాలేదని నిరాశ చెందవద్దన్నారు. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం ద్వారా చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్, వైస్ ప్రిన్సిపాల్ సమీరా, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి సురేష్ కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్కాన్ చెయ్.. టికెట్ తీస్కో..

ఆర్టీసీలో నగదు రహిత సేవలు

- ప్రస్తుతం సూపర్ డీలక్స్ బస్సుల్లో ప్రారంభం
- దశలవారీగా అన్ని సర్వీసుల్లో అమలు

మెదక్ మున్సిపాలిటీ: 'టికెట్‌కు సరిపడా చిల్లర ఇచ్చి కండక్టర్‌కు సహకరించగలరు' అనే నినాదానికి ఇక నుంచి ఆర్టీసీ సంస్థ స్వస్తి పలకనుంది. వేధిస్తున్న చిల్లర సమస్యను తట్టుకునేందుకు బస్సుల్లో నగదు రహిత సేవలు అందించేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ప్రతి బస్సులో ఈ-టిమ్ యంత్రాలు అందుబాటులోకి తీసుకొస్తుంది. దీంతో ప్రయాణికులు, కండక్టర్ల మధ్య చిల్లర గొడవ తీరిపోనుంది. గతంలో చిల్లర లేక కండక్టర్లు ఇతర ప్రయాణికులతో డబ్బులు జత చేసి ఇవ్వడంతో ఇబ్బందులు ఎదురయ్యేవి.

మెదక్ డిపోకు 80 ఈ-టిమ్ మిషన్లు

మెదక్ డిపోలో మొత్తం 94 బస్సులు ఉండగా, ఇందులో 39 ప్రభుత్వ, 55 ప్రైవేట్ బస్సులు ఉన్నాయి. వీటి కోసం ఆర్టీసీ యాజమాన్యం 80 నగదు రహిత ఈ-టిమ్ యంత్రాలను మెదక్ డిపోకు కేటాయించినట్లు డిపో మేనేజర్ సురేఖ తెలిపారు. ఈ యంత్రాలతో (ఫోన్ పే, గూగుల్ పే) నగదు రహిత ఆన్‌లైన్ యాప్ ద్వారా స్కాన్ చేయవచ్చని తెలిపారు. అలాగే డెబిట్ కార్డులతో స్వైపింగ్ చేసి టికెట్ తీసుకునే సౌకర్యం ఆర్టీసీ కల్పించిందన్నారు. డిపోలో ప్రస్తుతం ఈ-టిమ్ యంత్రాలను సూపర్ లగ్జరీ బస్సుల్లో ప్రవేశపెట్టినట్లు చెప్పారు. మిగితా యంత్రాలను త్వరలోనే అన్ని బస్సుల్లో అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు.



మహిళా సౌరశక్తి

సోలార్‌ప్లాంట్ ఏర్పాటుకు అడుగులు

- మొదటగా 2 మెగావాట్ల ఉత్పత్తికి గ్రీన్ సిగ్నల్
- త్వరలో ప్రారంభం కానున్న ప్లాంట్ నిర్మాణం



మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందుకోసం రాష్ట్రంలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో వృథాగా ఉన్న భూముల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసి స్వయం సహాయక గ్రూపు సభ్యులకు (మహిళలకు) అప్పగిస్తే వారు ఆర్థికంగా ఎదుగుతారని భావించింది. ఇందు కోసం నర్సాపూర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములను ఎంపిక చేసింది. లబ్ధిదారుల వాటా ధనం కింద ప్రభుత్వం ఇప్పటికే నిధులు విడుదల చేసింది. ఇక బ్యాంకు రుణం రావడమే తరువాయి. ఆ వెంటనే సోలార్ ప్లాంట్ నిర్మాణం కానుంది.

– మెదక్‌జోన్

జిల్లాలోని నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి సంబంధించి 114 ఎకరాల భూములు ఉన్నాయి. అవి చాలా కాలంగా వృథాగా ఉన్నాయి. ఈ భూముల్లో సోలార్‌ప్లాంట్లను నిర్మించి స్వయం సహాయక గ్రూపు సభ్యులకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా విద్యుత్‌ను ప్రభుత్వానికి విక్రయించి వచ్చిన ఆదాయంలో ఆలయ భూమికి అద్దెరూపంలో చెల్లించి, మిగితా ఆదాయాన్ని వారు స్వీకరిస్తారు. దీంతో మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. కాగా మొదటి విడతగా రోజుకు రెండు మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తిని తయారు చేయనున్నారు. ఈ సామర్థ్యానికి అవసరమయ్యే 8 ఎకరాల భూమిని ప్రభుత్వానికి ఇప్పటికే అప్పగించారు.

బ్యాంకర్లతో సంప్రదింపులు

మొదటగా 2 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. ఒక మెగావాట్‌కు 4 వేల యూనిట్ల విద్యుత్ తయారు అవుతుండగా, రెండు మెగావాట్ల విద్యుత్‌కు నిత్యం 8 వేల యూనిట్ల విద్యుత్ తయారు కానుంది. ఒక్కో యూనిట్ విద్యుత్‌ను రూ. 3.13 చొప్పున డిస్కంలకు విక్రయిస్తారు. ఇందుకోసం 8 ఎకరాల్లో సోలార్‌ప్లాంట్ నిర్మాణం చేయాల్సి ఉంది. ఆ నిర్మాణానికి రూ. 6 కోట్లు ఖర్చు కానుంది. ఇందులో లబ్ధిదారుల వాటా 20 శాతం (రూ. 60 లక్షలు) అవుతుండగా ప్రభుత్వం ఇప్పటికే రూ. 40 లక్షలను విడుదల చేసింది. మిగితా రూ. 20 లక్షలు సదరు సభ్యులు చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఇకపోతే మిగితా రూ. 2.40 కోట్ల బ్యాంకు రుణం ఇచ్చేందుకు సంబంధిత అధికారులు బ్యాంకర్లతో సంప్రదింపులు జరుపుతున్నారు. బ్యాంకు రుణం మంజూరు కాగానే నర్సాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూమిలో సోలార్‌ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. అయితే దీనిని డీఆర్‌డీఓ పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టింది.

బ్యాంకు రుణం రాగానే పనులు

నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయ భూములు 114 ఎకరాలు ఉన్నాయి. ముందుగా రోజుకు 2 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ఉత్పత్తి కోసం 8 ఎకరాలను తీసుకున్నాం. ఇందుకు సంబంధించి మహిళల వాటా ధనం రూ. 60 లక్షలు అవుతుండగా, రూ. 40 లక్షలు ప్రభుత్వం విడుదల చేసింది. బ్యాంకు రుణం రూ. 2.40 కోట్లు మంజూరు కాగానే ప్లాంట్ నిర్మాణం మొదలవుతుంది.

– శ్రీనివాస్‌రావు, డీఆర్‌డీఓ, మెదక్

మహనీయుడు జ్యోతిబా పూలే

కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ కలెక్టరేట్: కుల, మతాలకు అతీతమైన సమాజాన్ని నిర్మించడానికి యువత నడుం బిగించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మహాత్మ జ్యోతిబా పూలే జయంతిని కలెక్టరేట్‌లో నిర్వహించగా.. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, వివిధ బీసీ సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పూలే దంపతులు సమాజ హితం కోసం పాటుపడ్డారని కొనియాడారు. ప్రభుత్వం సమీకృత గురుకులాలు ఏర్పాటు చేసి అన్నివర్గాల పిల్లలు విద్యనభ్యసించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. రాజీవ్ యువ వికాస పథకం ద్వారా జిల్లాలో సుమారు 4,500 మందికి రూ. 50 కోట్లతో స్వయం ఉపాధి రుణాలు సబ్సిడీతో ఇస్తున్నామన్నారు. అనంతరం సుహాసిని రెడ్డి మాట్లాడుతూ.. సమాజ రుగ్మతలను రూపుమాపేందుకు జ్యోతిబా పూలే నిరంతరం పోరాడరని తెలిపారు. అంతకుముందు పట్టణంలోని ధ్యాన్‌చంద్ చౌరస్తాలో జ్యోతిబా పూలే విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్, సెక్రటరీ రాజ్‌కుమార్, డీపీఓ యాదయ్య, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, జిల్లా బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడు మెట్టు గంగారం, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు నోముల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి

హవేళిఘణాపూర్/మెదక్ కలెక్టరేట్: వర్షాలు కురిస్తే ధాన్యం తడిసిపోకుండా రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ రాహుల్ రాజ్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మెదక్ మండల పరిధిలోని శివ్వాయిపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తరలింపులో అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు.



జ్యోతిబా పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్, తదితరులు

జిల్లా పోలీస్ కార్యాలయంలో..

మెదక్ మున్సిపాలిటీ: కుల వ్యవస్థ నిర్మూలనకు కృషి చేసిన గొప్ప మహనీయుడు మహాత్మ జ్యోతిబా పూలే అని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పూలే అంటరాని తనం, కుల వ్యవస్థ నిర్మూలనకు ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతిబా పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్పీ, పోలీస్ అధికారులు

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మెదక్‌జోన్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులే గెలవాలని, ఆదిశగా నేతలు, కార్యకర్తలు కృషి చేయాలని ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం పట్టణంలో ఆత్మీయ అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ హాజరై మాట్లాడారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని చెప్పారు. ఎమ్మెల్సీల గెలుపులో బీజేపీ కార్యకర్తలు, తపస్ నేతల కృషి మరిచి పోలేనిదన్నారు. అనంతరం ఎమ్మెల్సీ కొమురయ్య మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి బీజేపీ అభ్యర్థులను గెలిపిద్దామన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ అంజిరెడ్డి మాట్లాడుతూ.. పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి నిరంతరంగా కృషి చేస్తానని చెప్పారు. అంతకుముందు పట్టణంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్, మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు ప్రసాద్, నేతలు ఎంఎల్ఎన్ రెడ్డి, శివ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రఘునందన్‌రావు

సీఎం మూర్ఖుడిలా మాట్లాడుతున్నారు

సీఎం రేవంత్‌రెడ్డి మూర్ఖుడిలా మాట్లాడుతున్నారని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. తెలంగాణలో బీజేపీని రానివ్వమని అంటున్నారని, ఇటీవల రాష్ట్రంలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ వి జయం సాధించిన విషయం ఆయనకు కనబడటంలేదా అని ప్రశ్నించాడు. దేశంలో కాంగ్రెస్ పని అయిపోయిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ పదేళ్ల అధికారంలో ఉండి ప్రభుత్వ స్థలాలు విక్రయించిందన్నారు. మల్లన్నసాగర్, రంగనాయక సాగర్, కొండపోచమ్మ సాగర్‌ల కోసం వేలాది ఎకరాల పేదల భూములు లాక్కున్న చరిత్ర వారిదేనని ఆరోపించారు. ప్రస్తుతం భూములు ఎలా అమ్ముతారని కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

ఆయిల్‌పామ్ సాగులో మోడల్‌గా నిలపాలి

మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

నంగునూరు(సిద్దిపేట): తెలంగాణకు గుండెకాయగా ఉన్న సిద్దిపేటను ఆయిల్‌పామ్ సాగులో ఆదర్శంగా నిలపాలని వ్యవసాయశాఖ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధికారులను ఆదేశించారు. నర్మెటలో 65 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని శుక్రవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సందర్శించారు. అనంతరం జరిగిన సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయగానే నర్మెటలో నిర్మిస్తున్న ఆయిల్ ఫ్యాక్టరీపైనే తొలి సంతకం చేశానన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా అధునాతన మిషన్లు, టెక్నాలజీతో ఫ్యాక్టరీ నిర్మిస్తున్నామని, ఇక్కడే రిఫైనరీ చేస్తారన్నారు. జూన్ నెలాకరు వరకు ఫ్యాక్టరీ ప్రారంభించేలా ఆయిల్‌ఫెడ్ చైర్మన్, కలెక్టర్ చొరవ తీసుకొని అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేయాలన్నారు. నూనె వినియోగం పెరగడంతో లక్ష కోట్ల రూపాయల విదేశీ మారకం వృథాగా మారుతోందని, దీన్ని అరికట్టేందుకు 70 లక్షల ఎకరాల్లో సాగు చేయాల్సిన అవసరం ఉందన్నారు.



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

అతివలే పనిమంతులు



'ఉపాధి' పనుల్లో మహిళలే ఎక్కువ

- ఉమ్మడి మెదక్ జిల్లాలో జాబ్ కార్డులు 5.8లక్షలు
- కూలీలు 11.29లక్షలు
- వసతులు కల్పిస్తే సంఖ్య మరింత పెరిగే అవకాశం

ఉపాధి పనుల వివరాలు..

జిల్లా	జాబ్ కార్డులు (లక్షల్లో..)	కూలీలు (లక్షల్లో..)	వినియోగించుకున్న పని దినాలు	
			మహిళలు	పురుషులు
సిద్దిపేట	1.97	3.94	33,39,192	17,46,320
మెదక్	1.64	3.32	26,41,819	19,02,208
సంగారెడ్డి	2.19	4.03	31,07,773	19,60,788



ఉపాధి పనులు చేస్తున్న కార్మికులు

మహిళలు తాము ఎందులోనూ తక్కువ కాదని నిరూపిస్తున్నారు. పురుషులతో సమానంగా ఉద్యోగాల్లోనే కాకుండా వ్యవసాయం, కూలీ పనుల్లోనూ చెమటోడ్చి కష్టపడుతున్నారు. గ్రామీణ నిరుపేదలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఓ వరం లాంటిది. ఉమ్మడి మెదక్ జిల్లా (2024–25)లో పురుషుల కంటే మహిళలే ఎక్కువగా పని దినాలను ఉపయోగించుకుని భేష్ అనిపించారు.

సాక్షి, సిద్దిపేట: ఉమ్మడి మెదక్ జిల్లాలో 5.8లక్షల జాబ్ కార్డులుండగా 11.29లక్షల మంది ఉపాధి కార్మికులున్నారు. ఉపాధి హామీ పథకం ప్రారంభమైన కొత్తల్లో పురుషులే పనులకు వెళ్లేవారు. రాను రాను క్రమంగా మహిళలు ఆసక్తి చూపిస్తున్నారు. ఇప్పుడు ఎక్కువ పని దినాలను వినియోగించుకోవడంలో మహిళలలే ముందు వరుసల్లో నిలిచారు. ఉమ్మడి జిల్లాలో మహిళలు 90,88,784 పని దినాలను, పురుషులు 56,09,316 పని దినాలను ఉపయోగించుకున్నారు.

నైపుణ్య శిక్షణ

పథకంలో భాగంగా వంద రోజుల పని దినాలు పూర్తి చేసిన కుటుంబాల్లో యువతీ యువకులుంటే వారికి గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఉన్నతి అనే పథకం ద్వారా నైపుణ్య శిక్షణ అందిస్తున్నారు. ఉన్నతి శిక్షణలో సైతం అనేక రకాల నైపుణ్యాలు నేర్చుకునేందుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. ఈ శిక్షణతో మరింత రాణించి ఆర్థికంగా ముందుకు సాగుతున్నారు.

మరిన్ని వసతులు కల్పిస్తే..

ఉపాధి హామీ పథకంలో కూలీలకు అన్ని వసతులు కల్పిస్తే మహిళల సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయి. రోజుకు 3 నుంచి 5గంటల వ్యవధిలో రూ.307 వరకు సంపాదించుకునే ఆస్కారం ఉండడంతో వ్యవసాయ ఆధారిత కూలీలు సైతం ఉపాధి పనుల వైపు మొగ్గు చూపుతున్నారు.

కుటుంబ పోషణకు చేదోడు



ఉపాధి హామీ పనులకు వెళ్తుండటంతో వచ్చిన డబ్బులు కుటుంబ పోషణలో చేదోడు వాదోడుగా నిలుస్తున్నాయి. అలాగే ఆర్థికంగా ఎదగడానికి ఉపాధి పనులు దోహదపడుతున్నాయి. పనుల దగ్గర మహిళల కోసం మరిన్ని సౌకర్యాలు కల్పిస్తే ఇంకా పనులకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుంది.

–యాదలక్ష్మి, చిన్నకోడూరు

సమాన పనికి.. సమాన వేతనం



ఉపాధి పనుల్లో సమాన పనికి సమాన వేతనం లభిస్తోంది. దీంతో మహిళలు ఎక్కువగా పనులకు వస్తున్నారు. మహిళలు ఎక్కువ పని దినాలను ఉపయోగించుకోవడం సంతోషదాయకం. ఉన్నతి ద్వారా నైపుణ్య శిక్షణ సైతం అందిస్తున్నాం. యువతీ యువకులు అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– జయదేవ్, పీడీ, డీఆర్‌డీఏ, సిద్దిపేట

క్లుప్తంగా

అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేస్తే లాభాలు

శాస్త్రవేత్త రాహుల్‌ విశ్వకర్మ



మాట్లాడుతున్న రాహుల్‌ విశ్వకర్మ

వట్‌పల్లి(అందోల్‌): అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేస్తే దిగుబడి పెరిగి లాభసాటిగా ఉంటుందని సంగుపేట ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రాహుల్‌ విశ్వకర్మ అన్నారు. శుక్రవారం అందోలు మండల పరిధిలోని అల్మాయిపేట గ్రామంలో అధిక సాంద్రత పత్తి పంట సాగుపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాధారణ పత్తి సాగు కంటే ఈ అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేస్తే మేలైన దిగుబడి, మొక్కల సంఖ్య పెరుగుతుందన్నారు. ఎకరాకు 22 వేల నుంచి 25 వేల వరకు మొక్కలు వస్తాయన్నారు. ఒకేసారి పూత కాత వచ్చి పంట తొందరగా చేతికి వస్తుందన్నారు. తద్వారా గులాబీ రంగు, కాయ తొలుచు పురుగు బారి నుంచి తప్పించుకొని నికర ఆదాయం పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రవి కుమార్‌, ప్రతాప్‌ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీహరి, ఏఈఓ లక్ష్మీకాంత్‌, రేఖా మనోజ్‌, శ్రీకాంత్‌, ఓ.ఆకాశ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా కేసులో ఇద్దరికి పదేళ్ల జైలు



కార్తీక్‌ రవి కిరణ్‌



కమల్‌ సంజయ్‌

రామచంద్రాపురం(పటాన్‌ చెరు): గంజాయి రవాణా కేసులో ఇద్దరికి న్యాయమూర్తి జైలు శిక్షతోపాటు జరిమానా విధించారు. కొల్లూరు పోలీసుల కథనం మేరకు.. మహారాష్ట్రకు చెందిన కార్తీక్‌ రవికిరణ్‌ దేశ్ముఖ్‌, కమల్‌ సంజయ్‌ ఇద్దరూ కలిసి 2023 సెప్టెంబర్‌లో కారులో గంజాయిని విశాఖపట్నం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు అప్పట్లో పోలీసులు ఓఆర్‌ఆర్‌ కొల్లూరు వద్ద ఇద్దరిని పట్టుకున్నారు. వారి నుంచి 125 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. శుక్రవారం నిందితులను మొదటి అదనపు న్యాయమూర్తి జయంతి ఎదుట హాజరుపర్చగా ఇద్దరికీ 10 ఏళ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున జరిమానా విధించారు. ఈ కేసును పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌ రాజేశ్వరరావు వాదించారు. నిందితులకు శిక్ష పడటంలో ముఖ్య పాత్ర వహించిన అప్పటి సీఐ సంజయ్‌ కుమార్‌, ప్రస్తుత సీఐ రవీందర్‌, కోర్ట్‌ కానిస్టేబుల్‌ నర్సింహులు, ఏఎస్‌ఐ రవీందర్‌ రెడ్డిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

జేసీబీ గుంతలో పడి యువకుడు మృతి

కొల్చారం(నర్సాపూర్‌): ప్రమాదవశాత్తు చెరువు జేసీబీ గుంతలో పడి యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని చిన్నఘనాపూర్‌ గ్రామంలో శుక్రవారం వెలుగులోకి వచ్చింది. కొల్చారం ఎస్‌ఐ మహమ్మద్‌ గౌస్‌ కథనం మేరకు.. గ్రామానికి చెందిన పోతగోని ఆగమయ్య గౌడ్‌ పెద్ద కుమారుడు రాము గౌడ్‌(27)కు చెవులు వినిపించవు. పాడి గేదెలను మేపుతూ వస్తున్నాడు. గురువారం గేదెలను మేపడానికి వెళ్లాడు. సాయంత్రం గేదెలు ఇంటికి వచ్చినప్పటికీ రాము గౌడ్‌ మాత్రం రాలేదు. కుటుంబ సభ్యులు గ్రామంలోని పెద్ద చెరువు వద్ద వెతుకుతుండగా జేసీబీ గుంత వద్ద చెప్పులు కనిపించాయి. మత్స్యకారులతో కలిసి రాత్రి వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం వెళ్లి చూడగా నీటిపై రాము గౌడ్‌ మృతదేహం కనిపించింది. కాలుజారి ప్రమాదవశాత్తు గుంతలో పడి చనిపోయి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చెక్‌డ్యాంలో మునిగి మరో యువకుడు

పాపన్నపేట(మెదక్‌): చెక్‌ డ్యాంలో మునిగి యువకుడు మృతి చెందిన ఘటన పాపన్నపేట మండలం పొడిచన్‌పల్లిలో శుక్రవారం వెలుగు చూసింది. ఏఎస్‌ఐ సంగన్న కథనం మేరకు.. గ్రామానికి చెందిన చాకలి అనిల్‌ (22) కూలీ పనులతోపాటు, స్టార్‌ కలెక్షన్‌ బిల్లులు వసూలు చేస్తుంటాడు. గురువారం సాయంత్రం బైక్‌పై బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు గ్రామశివారులో వెతికినప్పటికీ జాడ దొరక లేదు. శుక్రవారం ఉదయం మంజీరా నదిలో నిర్మించిన చెక్‌డ్యామ్‌ వద్ద అనిల్‌ బైక్‌ కనిపించింది. అనుమానంతో నదిలో వెతకగా మృతదేహం లభ్యమైంది. కుమారుడి మృతిపై తండ్రి పోచయ్య అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఆలయంలో చోరీ

మునిపల్లి(అందోల్‌): పెద్దచల్మెడ దుర్గా భవానీ అమ్మవారి దేవాలయంలో వెండి కిరీటం, బంగారు జింకలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామస్తులు, దేవాలయ కమిటీ సభ్యుల ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ రాజేశ్‌ నాయక్‌ తెలిపారు.

అరటి.. లాభాల్లో మేటి

అరటికి ఏ సీజన్‌లోనైనా మంచి డిమాండ్‌ ఉంటుంది. ఏడాది పొడువునా సాగుకు అనుకూలంగా ఉండటంతో రైతులు పంట పండిస్తున్నారు. వాణిజ్యపరంగా అత్యంత ప్రాధాన్యత సంతరిచుకోవడంతో ఆసక్తి చూపుతున్నారు. అరటిలో కేవలం పండు మాత్రమే కాకుండా పిలకలు, ఆకులకు గిరాకీ ఉంటుంది. లాభాలు రాకున్నా నష్టం మాత్రం ఉండదు. అందుకని రైతులు అరటి సాగు పట్ల ఆసక్తి చూపుతుంటారు. కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే మంచి దిగుబడులతో అధిక లాభాలు సాధించవచ్చు. సంగారెడ్డి జిల్లాలో జహీరాబాద్‌, నారాయణఖేడ్‌ తదితర ప్రాంతాల్లో రైతులు అధిక విస్తీర్ణంలో అరటిని సాగు చేస్తున్నారు.

- జహీరాబాద్‌ టౌన్‌



జహీరాబాద్‌లో సాగవుతున్న అరటి తోట

- పంట సాగుకు అనువైన సమయం
- అన్ని సీజన్‌లలో మంచి డిమాండ్‌
- పిలకలు, ఆకులకు సైతం గిరాకీ
- సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

అరటి ఉష్ణ మండల పంట. ఏడాది పొడుగునా సాగు చేయొచ్చు. 10 నుంచి 40 డిగ్రీల సెంటీగ్రేడ్‌ ఉష్ణోగ్రతల్లోనూ దిగుబడి వస్తుంది. ఉష్ణోగ్రత తక్కువగా ఉంటే గెలల్లో ఎదుగుదల తగ్గుతుంది. నీరు ఇంకే సారవంతమైన నేలలు అరటి పంటకు అనుకూలం. ఏప్రిల్‌ నుంచి ఆగస్టు నెలల్లో మొక్కలు నాటడం వల్ల సమస్యలు తగ్గి అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంది. చౌడు భూములు అనుకూలం కావు. భూమిని దుక్కి చేసి చదును చేసిన తర్వాత ఆరడుగుల పొడవు, ఐదడుగుల వెడల్పుతో నాటుకోవాలి. గుంత పైభాగం మట్టికి 5 కిలోల పశువుల ఎరువు, 300 గ్రాముల ఆముదం లేదా వేప పిండి, 150 గ్రాముల సూపర్‌ఫాస్ఫేట్‌ కలిపి గుంతలు పూడ్చాలి. నీరు పెడితే గుంతలో మట్టి సర్దుకుంటుంది. టిష్యూ కల్చర్‌ మొక్కలను మట్టి గడ్డి చెదరకుండా పాలథీన్‌ సంచులను తీసి గుంతల మధ్యలో పెట్టి డ్రిప్‌ పద్ధతి ద్వారా నీరు పెట్టాలి.

తెగళ్లు- నివారణ:

- వాతావరణంలో తేమ అధికంగా ఉన్నప్పుడు అరటికి నులి పురుగుల బెడద ఎక్కువగా ఉంటుంది.
- అరటి సాగుకు ముందు విత్తన శుద్ధి చేసుకోవాలి. నులి పురుగు ఆశించినట్లయితే 5 గ్రాముల కాపర్‌ ఆక్సీక్లోరైడ్‌+2.5 మి.లీ మోనోక్రాటోఫాస్‌ లీటరు నీటిలో కలిపి మిశ్రమ ద్రావణం తయారు చేసుకోవాలి.

పిలకలు తీసివేస్తే మేలు



అరటి చెట్టుకు 3 నుంచి 8 వరకు పిలకలు వస్తాయి. అవసరానికి మించి నత్రజని వేసినప్పుడు తదితర కారణాల వల్ల పిలకలు ఎక్కువగా వస్తాయి. వీటిని ఎప్పటికప్పుడూ తీయాలి. లేకుంటే తల్లి చెట్టుతో సమానంగా పోటీ పడి తెగుళ్లు, పురుగుల బెడద పెంచుతుంది. టిష్యూ కల్చర్‌ మొక్కలను పోషక పదార్థాలు నిల్వ ఉండే దుంపలుండవు. ఇవి నాటిన వెంటనే తొందరగా పెరగవు. ఎరువులను సమర్థవంతంగా ఉపయోగించుకుంటాయి. నాటిన నాలుగైదు నెలల్లో గెల అంకురం ఏర్పడి కాయల సంఖ్య నిర్ణయమవుతుంది. అందుకని సిఫారసు మేరకు ఎరువులు అందించాలి.

- అరటి పెరుగు దశలో పురుగుల నియంత్రణ కోసం కార్బోఫ్యూరాన్‌ 3జీ గులకలను మొక్కల దగ్గరగా వేయాలి.
- అరటి కాయల చివర మెచ్చిక వద్ద నల్లగా మారి కుళ్లు మచ్చలు ఏర్పడుతాయి. నివారణ చర్యగా ఒక గ్రామ్‌ కార్బండజిమ్‌ లీటరు నీటిలో కలిపి అరటి గెలలు పూర్తిగా తడిచేలా పిచికారీ చేయాలి.
- ఆకుమచ్చ తెగుళ్లు వర్షాకాలంలో ఆశిస్తుంది. తోటలో నీరు నిల్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తెగులు ఎక్కువగా ఉంటే 2.5 గ్రాముల మాంకోజెబ్‌ లేదా 2 గ్రాముల క్లోరోథలోనిల్‌ లీటరు నీటి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

జాగ్రత్తలు పాటిస్తే లాభాలు

కొద్దిపాటి జాగ్రత్తలు పాటిస్తే అరటిలో సాగులో అధిక లాభాలు సాధించవచ్చు. పంట సాగు విషయంలో అధికారుల సూచనలు, సలహాలు తీసుకోవాలి. విత్తన శుద్ధి చేపట్టి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి. నీరు, ఎరువులు సమయానికి అందించాలి. అధికంగా రసాయనాలు వాడొద్దు.

-పందరి, ఉద్యానశాఖ అధికారి, జహీరాబాద్‌

మతం పేరుతో మారణ హోమం

- హిందూ సెంటిమెంట్‌తో మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్న మోదీ
- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌ రెడ్డి



నిరసన తెలుపుతున్న చాడ వెంకట్‌ రెడ్డి, నాయకులు

హుస్నాబాద్‌: మతం పేరుతో మారణ హోమం సాగిస్తూ హిందూ సెంటిమెంట్‌తో మళ్లీ అధికారంలోకి రావాలని నరేంద్ర మోదీ పూనుకుంటున్నారని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌ రెడ్డి ఆరోపించారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం భారత రాజ్యాంగానికి విఘాతం కలిగిస్తుందని సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ముఖ్య అతిథిగా చాడ వెంకట్‌ రెడ్డి హాజరయ్యారు. అంతక ముందు మహాత్మా జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. చాడ వెంకట్‌ రెడ్డి మాట్లాడుతూ.. జ్యోతిబా పూలే, సావిత్రీ బాయి పూలేలు ఉద్యమ సంస్కరణలకు పునాది వేశారన్నారు. ఒక మతం పై మరో మతం పెత్తనం చేయకూడదని అంబేడ్కర్‌ రాజ్యాంగంలో పొందుపర్చారన్నారు. కులాలు, మతాలకు అతీతంగా ఉండేలా మానవత్వం పూనుకున్న వ్యవస్థను నిర్మించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేపడితే, కేంద్రం ఎందుకు చేయదని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా కుల, జనగణన చేపడితేనే వాస్తవాలు బయటపడుతాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్‌, రాష్ట్ర కౌన్సిల్‌ సభ్యుడు గడిపె మల్లేశ్‌, నాయకులు జాగిరి సత్యానారాయణ, వనేష్‌, జనార్దన్‌, భాస్కర్‌, కుమార్‌, శ్రీధర్‌, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల సాగుపై దృష్టి సారించాలి

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు
- కుందనవానిపల్లి తోటలు పరిశీలన



కూరగాయల తోటను పరిశీలిస్తున్న నాగరాజు

అక్కన్నపేట(హుస్నాబాద్‌): ప్రతీ ఒక్క రైతు కూరగాయల సాగుపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యాన శాఖ సలహాదారుడు నాగరాజు అన్నారు. అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి గ్రామంలో ఏలేటి స్వామిరెడ్డి అనే రైతు సాగు చేసిన కూరగాయల తోటను సందర్శించి పలు సూచనలు, సలహాలను ఇచ్చారు. అదే విధంగా మైసమ్మవాగు తండా, గండిపల్లి గ్రామాల్లో సాగు చేసిన కూరగాయల పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షెడ్‌ నెట్ల కింద కూరగాయలు, పూలు, సుగంధ ద్రవ్యాల మొక్కలు తదితర పండించవచ్చునన్నారు. కర్రలపై షెడ్‌ నెట్లు పరిచి వాటి కింద మిరప, క్యారెట్‌ తదితర కూరగాయలు, ఆకు కూరలు పండించవచ్చన్నారు. బిందు సేద్యం పద్ధతిలో మొక్కలకు నీటి ద్వారా పోషకాలు, ఎరువులు అందించవచ్చు అన్నారు. తద్వారా నీటిని పొదుపు చేయడంతోపాటు ఎరువుల వృథా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి కరంటోతు శ్రీలత, రైతులు స్వామిరెడ్డి, శ్రీను, వెంకటేష్‌, రమేష్‌, తదితరులు పాల్గొన్నారు.

డబ్బుల కోసమే మహిళ హత్య

- నిందితుడి రిమాండ్‌
- గతంలోనూ పలు హత్యలు చేసి జైలుకి
- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌ రెడ్డి

నర్సాపూర్‌: డబ్బుల కోసం మహిళను హత్య చేసిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌ తరలించినట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక సీఐ కార్యాలయంలో కేసు వివరాలు వెల్లడించారు. నర్సాపూర్‌ మండలంలోని జైరాంతండాకు చెందిన మెఘావత్‌ భుజాలీ (52) గత నెల 25న కనిపించడం లేదని కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో భుజాలీ 3న మెదక్‌ మార్గంలోని అడవిలో కుళ్లిన మృతదేహమై కనిపించింది. సీసీ కెమెరాల ఫుటేజీల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టగా మహబూబ్‌నగర్‌ జిల్లా అదే మండలంలోని అయ్యగారిపల్లె తండాకు చెందిన కెథావత్‌ గోపాల్‌ హత్య చేసినట్లు గుర్తించారు. భుజాలీకి మాయ మాటలు చెప్పి స్థానిక బస్టాండ్‌ ఏరియా నుంచి మెదక్‌ మార్గంలోని డంప్‌యార్డు పక్కన ఉన్న అడవిలోకి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆమెకు మద్యం తాగించి చీరతో ఉరేసి చంపి ఆమె వద్ద ఉన్న రూ.400 తీసుకొని వెళ్లాడని వివరించారు.

గతంలోనూ హత్యలు చేసి జైలుకి

గోపాల్‌పై గతంలోనే పలు కేసులు ఉన్నాయని, డబ్బులతోపాటు వారి వద్ద ఉండే చిన్నపాటి వెండి నగల కోసం హత్యలు చేస్తుంటాడని తెలిపారు. కామారెడ్డి జిల్లాలో మూడు హత్యలు చేసినట్లు నిందితుడు అంగీకరించాడని చెప్పారు. మహబూబ్‌నగర్‌ జిల్లాలో సైతం రెండు కేసులు ఉన్నాయన్నారు. వికారాబాద్‌ జిల్లా బొమ్మరాస్‌పేట్‌ పోలీస్‌ స్టేషన్‌లో పరిధిలో ఓ హత్య కేసులో పదేళ్లు జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చాడని ఎస్పీ వివరించారు. సమావేశంలో తూప్రాన్‌ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, స్థానిక సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ లింగం, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

ఏఐతో సాంకేతిక విప్లవం



జోగిందర్‌కు పూలమొక్క అందజేస్తున్న విద్యార్థిని, పక్కన సొసైటీ చైర్మన్‌ ఆదిత్య

నర్సాపూర్‌: వారం రోజుల పాటు చేసే పనిని ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌తో రెండు రోజుల్లో పూర్తి చేసే విధంగా సాంకేతిక విప్లవాలు వచ్చాయని తెలంగాణ ప్రభుత్వ టీ వర్క్స్‌ చీఫ్‌ ఎగ్జిక్యూటివ్‌ ఆఫీసర్‌ (సీఈఓ) తనికెళ్ల జోగిందర్‌ అన్నారు. శుక్రవారం రాత్రి స్థానిక బీవీ రాజు ఇంజనీరింగు కాలేజీ 28వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జోగిందర్‌ పాల్గొని మాట్లాడారు. సాంకేతిక విప్లవాలను విద్యార్థులు నేర్చుకొని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని హితవు పలికారు. శ్రీ విష్ణు ఎడ్యుకేషనల్‌ సొసైటీ చైర్మన్‌ ఆదిత్య విస్సాం మాట్లాడుతూ వసతులను వివరించారు. కాలేజీ డైరెక్టర్‌ లక్ష్మీప్రసాద్‌, ప్రిన్సిపాల్‌ సంజయ్‌దూబె, మేనేజర్‌ బాపిరాజు, ఏఓ సురేశ్‌ పాల్గొన్నారు. అనంతరం పీహెచ్‌డీ పూర్తి చేసిన ప్రొఫెసర్లను శాలువాలు, మెమెంటోలతో సన్మానించారు.

బస్సు వచ్చే.. బాధలు తీరే

- సొంత నిధులతో కలెక్టర్‌ మనుచౌదరి బస్సు ఏర్పాటు
- గురువన్నపేట ప్రభుత్వ పాఠశాలకు అందజేత
- మూడు గ్రామాల విద్యార్థులకు తీరిన కష్టాలు



కొముర‌వెల్లి(సిద్దిపేట): తమ గ్రామాలకు పాఠశాల దూరంగా ఉందని, కాలినడకన రావడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, ప్రైవేట్‌ వాహనాన్ని ఆశ్రయిస్తే ఖర్చు ఎక్కువ అవుతుందని గురువన్నపేట పాఠశాల విద్యార్థులు కలెక్టర్‌ మను చౌదరికి తమ కష్టాలను చెప్పుకున్నారు. వెంటనే స్పందించి ఆయన సొంత నిధుల నుంచి పాఠశాలకు బస్సు వేయించారు.

సుమారు 212 మంది విద్యార్థులు

మండలంలోని గురువన్నపేట ఉన్నత, ప్రాథమిక పాఠశాలలో సుమారు 212 మంది విద్యార్థులు గురువన్నపేట, పోసాన్‌పల్లి, కొండపోచమ్మ గ్రామాల నుంచి వచ్చి విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాల మూడు గ్రామాలకు 2 నుంచి 3 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. పిల్లలు నడిచి వెళ్లలేరని విద్యార్థుల తల్లిదండ్రులు ఓ ప్రైవేట్‌ బస్సు ఏర్పాటు చేశారు. దీనికి నెలకు ఒక విద్యార్థికి రూ.700 చొప్పున చెల్లిస్తున్నారు.

రూ.17 లక్షలు వెచ్చించి

విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించేందుకు గురువన్నపేట ఉన్నత పాఠశాలలో మార్చి 15న కలెక్టర్‌ మనుచౌదరి ఆర్టిఫిషియల్‌ ఇంటలిజెన్స్‌ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా విద్యార్థులు, వారి తల్లి దండ్రులు కలెక్టర్‌తో మాట్లాడారు. తమ గ్రామాలకు పాఠశాల దూరంగా ఉందని, రావడానికి వెళ్లడానికి చిన్న పిల్లలు, ఆడ పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారని బస్సును వేయించాలని కోరారు. వెంటనే స్పందించిన కలెక్టర్‌ సొంత నిధుల నుంచి సుమారు రూ.17 లక్షలు ఖర్చు పెట్టి బస్సును కొనుగోలు చేసి పాఠశాలకు అందజేసి వారి కష్టాలను తీర్చారు. మూడు గ్రామాలకు కలిపి గ్రామానికి ఒక ట్రిప్పు చొప్పు బస్సు వచ్చి విద్యార్థులను పాఠశాలకు తీసుకెళ్తుంది.

చాలా సంతోషంగా ఉంది



కోరిన వెంటనే కలెక్టర్‌ మా పాఠశాలకు బస్సు అందివ్వడం చాలా సంతోషంగా ఉంది. విద్యార్థులం అందరం కలెక్టర్‌కు రుణపడి ఉంటాం. ఇప్పటి వరకు ప్రైవేట్‌ వాహనానికి నెలకు రూ.700 చెల్లించడంతో తల్లిండ్రులపై అధిక భారం పడేది. పాఠశాలకు కలెక్టర్‌ బస్సు ఇవ్వడంతో ఆ భారం తగ్గింది.

- పుట్ట పవిత్ర 9 తరగతి విద్యార్థిని

12 మందితో కమిటీ



పాఠశాలకు కలెక్టర్‌ బస్సు అందజేయడం శుభపరిణామం. బస్సు మెయింటెనెన్స్‌ కోసం 12 మందితో కమిటీని ఏర్పాటు చేశాం. విద్యార్థులకు మంచి బోధనను అందించేందుకు పాఠశాల ఉపాధ్యాయులం అందరం కృషి చేస్తాం. విద్యార్థులు బస్సు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి

– రాజు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

ఎన్‌సీసీతో యువతకు బంగారు భవిష్యత్‌



ఎన్‌సీసీ విద్యార్థులతో లెఫ్టినెంట్‌ కల్నల్‌ జయంత, కళాశాల సిబ్బంది

- కమాండింగ్‌ ఆఫీసర్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ జయంత
- ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల సందర్శన

సిద్దిపేట ఎడ్యుకేషన్‌: ఎన్‌సీసీ ద్వారా దేశ సేవ చేయడానికి, అదే విధంగా అపార ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, యువత బంగారు భవిష్యత్‌కు పునాదులు పడుతాయని తెలంగాణ-9వ కమాండింగ్‌ ఆఫీసర్‌ లెఫ్టినెంట్‌ కల్నల్‌ జయంత అన్నారు. శుక్రవారం ఆయన ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్‌), ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌సీసీ సర్టిఫికెట్‌ ద్వారా రాత పరీక్ష లేకుండానే ప్రత్యేక ఎంట్రీ ద్వారా ఆఫీసర్‌ స్థాయి ఉద్యోగాలతో పాటు, త్రివిధ సాయుధ దళాలు, అగ్నివీర్‌ వంటి ఉద్యోగాలు నేరుగా పొందవచ్చన్నారు. తద్వారా దేశ నిర్మాణంలో భాగస్వామ్యులు అయ్యే అవకాశం ఉందన్నారు. కళాశాల వాతావరణం చాలా బాగుందని, పూర్వ విద్యార్థుల (అలుమ్ని) గురించి తెలుసుకున్న కమాండింగ్‌ ఆఫీసర్‌ మరలా కళాశాల సందర్శించడానికి వస్తానని, స్పెషల్‌గా సమావేశం అవుతానని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సునీత మాట్లాడుతూ.. ఎన్‌సీసీ విద్యార్థులు చక్కటి క్రమశిక్షణ కలిగి ఉంటారని, ఎన్నో యూనిఫామ్‌ ఉద్యోగాలు సాధించారన్నారు. అగ్నివీర్‌ ద్వారా ప్రతీ ఏడాది 10 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారన్నారు. అనంతరం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను సందర్శించారు. కార్యక్రమంలో మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జీవన్‌కుమార్‌, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థికి పాము కాటు

పాపన్నపేట(మెదక్‌): విద్యార్థిని పాము కాటు వేసిన ఘటన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది . వివరాల్లోకి వెళ్తే.. కుర్తివాడ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న సాత్విక్‌ ఇంటర్‌ వెల్‌ సమయంలో బయటకు వెళ్లగా చేతిపై పాము కాటు వేసింది. రక్తం కారుతుండటంతో తోటి విద్యార్థులు పరుగెత్తుకొచ్చి టీచర్లకు తెలిపారు. వెంటనే వారు డీఈఓ రాధాకిషన్‌కు విషయం చెప్పి మెదక్‌ ఏరియా ఆస్పత్రికి విద్యార్థిని తరలించారు. అనంతరం విషయాన్ని కలెక్టర్‌ రాహుల్‌రాజ్‌ దృష్టికి తీసుకెళ్లారు. బాలుడు కోలుకుంటున్నట్లు కుటుంబీకులు తెలిపారు.

వేర్వేరు కారణాలతో ఐదుగురు బలవన్మరణం

సిద్దిపేట, మెదక్‌ జిల్లాలో శుక్రవారం ఒక్కరోజే వేర్వేరు కారణాలతో ఐదుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు.

కడుపునొప్పి తాళలేక యువకుడు



స్వామి (ఫైల్‌)

ములుగు(గజ్వేల్‌): ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ములుగు మండలం మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ విజయ్‌కుమార్‌ కథనం మేరకు.. మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్‌ కాలనీకి చెందిన జమాల్పూర్‌ స్వామి(23) కడుపునొప్పి బాధను భరించలేక 4న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయాన్ని బావమరిదికి వీడియో కాల్‌ చేసి చెప్పాడు. కుటుంబీకులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం లక్ష్మక్కపల్లి ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ స్వామి శుక్రవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కుటుంబ సభ్యులు మందలించారని వ్యక్తి



యాదయ్య (ఫైల్‌)

దుబ్బాకటౌన్‌: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రాయపోల్‌ మండలం చిన్నమాసాన్‌ పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కాకల్ల యాదయ్య (59) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. మొదటి భార్య సత్తవ్వ మృతి చెందడంతో 25 ఏళ్ల కిందట ఐలవ్వను రెండో వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు నలుగురు కూతుర్లు, రెండో భార్యకి కుమారుడు ఉన్నాడు. యాదయ్య మద్యానికి బానిసయ్యాడు. గురువారం రాత్రి కూడా మద్యం సేవించి ఇంటికి రావడంతో కుటుంబ సభ్యులు ఇలా తాగితే ఎలా అని మందలించారు. దీంతో మనస్తాపానికి గురై యాదయ్య శుక్రవారం ఉదయం వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య ఐలవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ కృష్ణంరాజు తెలిపారు.

అప్పుల బాధతో యువకుడు

చిన్నకోడూరు(సిద్దిపేట): అప్పుల బాధతో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డ ఘటన చిన్నకోడూరులో శుక్రవారం వెలుగు చూసింది. ఎస్‌ఐ బాలకృష్ణ కథనం మేరకు.. గ్రామానికి చెందిన రేపాక యాదవ్వ-రమేశ్‌ దంపతుల కుమారుడు రేపాక రోహిత్‌(22) ఫాస్ట్‌ ఫుడ్‌ సెంటర్‌లో పని చేస్తున్నాడు. కుటుంబ పోషణకు చేసిన అప్పులు పెరిగిపోయాయి. ఉపాధి కోసం తండ్రి హైదరాబాద్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్నాడు. రోహిత్‌, తల్లి, చెల్లితో చిన్నకోడూరులో ఉంటున్నాడు. అప్పుల వాళ్లు అడుగుతుండటంతో మనస్తాపం చెంది రోహిత్‌ గురువారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం గుర్తించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు.. మృతుడి తల్లి యాదవ్వ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనారోగ్య సమస్యలతో వృద్ధుడు

చిన్నశంకరంపేట(మెదక్‌): అనారోగ్య సమస్యలతో వృద్ధుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నార్సింగి మండలం భీమ్‌రావుపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. నార్సింగి ఎస్‌ఐ అహ్మద్‌ మోహినొద్దీన్‌ కథనం మేరకు.. నార్సింగి మండలం భీమ్‌రావుపల్లి గ్రామానికి చెందిన కొంగల సిద్ధయ్య(60) వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అనారోగ్య సమస్యలతో సిద్ధయ్య బాధపడుతున్నాడు. భార్య నర్సమ్మ కూడా ఆరు నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మందులు వాడుతుంది. దీంతో జీవితంపై విరక్తి చెంది సిద్ధయ్య గ్రామ శివారులోని కాల్వ గట్టు వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య నర్సమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఎలక్ట్రీషియన్‌..

దుబ్బాక: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ గంగరాజు కథనం మేరకు.. దుబ్బాక మండలం రాజక్కపేటకు చెందిన మోహన్‌(50) రేకులకుంట మల్లికార్జున స్వామి ఆలయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ భార్య ఇద్దరు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. సొంత ఇల్లు, ఎలా భూమి లేదు. కుటుంబం గడవడానికి అప్పులు చేశాడు. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. ఈ క్రమంలోనే గురువారం రాత్రి ఆలయంలో విధులకు హాజరై శుక్రవారం తెల్లవారుజామున ఆలయం సమీపంలోని అడవిలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య భాగ్యమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.